

చెరువులో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు



బస్తీ నుంచి వస్తున్న మురుగునీరు చెరువులో కలుస్తున్న దృశ్యం

మస్కకుంట.. ముక్కు మూసుకోవాల్సిందే..

- మురుగు, చెత్తమయం
- ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం
- సుందరీకరణకు నోచుకోని వైనం

హఫీజ్‌పేట్ : జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువులు, కుంటలను కోట్ల రూపాయలతో సుందరీకరిస్తున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు చెరువుల అభివృద్ధి పనులు చేపడుతున్నప్పటికి ఓల్డ్ హఫీజ్‌పేట్ సాయికాలనీ పక్కనే ఉన్న చెరువును మాత్రం పట్టించుకోవడం లేదు. చెరువులోకి భారీగా మురుగు నీరు చేరింది.ఇక చెత్త చెదారం వేస్తుండడంతో దుర్గంధంగా మారిపోయింది. కాగా వర్షాలకు చెరువు పూర్తిగా నిండితే సాయి కాలనీ ముంపునకు గురవుతుంది. ఈ క్రమంలో ఈ చెరువు నుంచి కాయిదమ్మకుంట చెరువులోకి మురుగు నీరు పోతోంది. ఈ చెరువు పక్కనే నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చెరువును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



హఫీజ్‌పేట్ డివిజన్ సాయికాలనీ పక్కనే ఉన్న మస్కకుంట చెరువు

- చెరువు సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి
- చెరువులోకి మురుగునీరు రాకుండా ప్రత్యేకంగా పైప్‌లైన్ వేయాలి
- చెరువులో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలి
- చుట్టూ ఫెన్సింగ్ వేసి వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయాలి
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సూచిక బోర్డు పెట్టాలి
- చెరువులో భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చూడాలి
- మస్కకుంట చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగునీటితో దుర్గంధం



మస్కకుంట చెరువులో కలుస్తున్న మురుగునీరు వల్ల దుర్గంధం వెదజల్లుతుంది. దోమల బెడద ఎక్కువైంది. పిల్లలకు జ్వరాలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

–మహేష్‌గౌడ్, సాయినగర్

చెరువు కబ్జా అవుతోంది



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చెరువులను అభివృద్ధి చేసినట్లు హఫీజ్‌పేట్‌లోని మస్కకుంటను కూడా అభివృద్ధి చేయాలి. రోజురోజుకు చెరువు కబ్జాకు గురవుతుంది. వెంటనే ఫెన్సింగ్‌తో పాటు వాకింగ్‌ట్రాక్ నిర్మించాలి. చెరువును శుభ్రం చేయాలి.

– శివాజీ, సాయినగర్

తేనెటీగల పెంపకంపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: తేనెటీగల జాతి అంతరించిపోతే మానవ మనుగడకు ప్రమాదమని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ సహాయ ఆచార్యులు డాక్టర్ సునీత అన్నారు. తేనెటీగల సాగు.. దాని ఉపయోగాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ సహాయ ఆచార్యురాలు డాక్టర్ సునీత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... పర్యావరణ అనుకూల వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. తేనెటీగల పెంపకంలో వెలువడే మైనం, ప్రోపోలిస్ యొక్క ఆదాయ వనరుల అవకాశాలను కార్యక్రమ నిర్వహణకర్త వీరేందర్ విద్యార్థులకు వివరించారు. తక్కువ వ్యవధి, పెట్టుబడితో తేనెటీగల పెంపకం చేపట్టవచ్చని వైస్ ప్రిన్సిపాల్ అల్లం రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు డాక్టర్ ఉదయ్, డాక్టర్ స్నేహలత, కళాశాల ఆచార్యులు డాక్టర్ రాజిరెడ్డి, రాధిక, కృష్ణ, రవీందర్, హరిత, జానయ్య, స్వప్న, డాక్టర్ భగ్గు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

రాయదుర్గం: పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) కొత్తపల్లి నర్సింహ సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లోని సీటీసీ కార్యాలయంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను విధిగా చేయించుకోవాలని సూచించారు. 1022 హోంగార్డులు, సిబ్బందికి పలు వైద్య పరీక్షలను నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్ డాక్టర్లు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ డాక్టర్ దుర్గేష్ శివ, సీటీసీ డాక్టర్లు సరిత, సుకుమార్, అదపు డీసీపీ రవిచందన్‌రెడ్డి, ఏసీపీ హోంగార్డ్స్ కృష్ణ, పోలీసు అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న మెడికవర్ డాక్టర్లు

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 50–60, బెండ 60, కాకర 60, దొండ 60, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 50, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 400.

బస్తీ దర్శన్..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో బుధవారం కార్పొరేటర్ పుష్ప నగేష్ ఆధ్వర్యంలో బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 4,7 బ్లాకులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో పూర్తి స్థాయిలో సమస్యలను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని వివరించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గిరిజన గురుకుల పాఠశాల పదోతరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్టడీమెటీరియల్‌ను అందజేశారు. బుధవారం ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను అందించారు.

శ్మశానవాటికను కబ్జా చేస్తే చర్యలు తప్పవు



శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని యల్లమ్మబండ అంబేద్కర్‌నగర్‌లోని హిందూ శ్మశానవాటికలో కొందరు రేకులషెడ్లు వేసి స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారనే విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి స్మశానవాటికను బుధవారం పరిశీలించారు. అక్రమంగా నిర్మిస్తున్న ఫినిషింగ్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత పోలీస్, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కబ్జాదారులు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదన్నారు. త్వరలో శ్మశానవాటికకు ప్రహరీ ,అంతర్గత రోడ్లు, వాకింగ్ ట్రాక్‌తో ఉద్యానవనం అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు, ఎల్లమ్మబండవాసులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

రూ.19 లక్షల 90వేలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ వ్యక్తి రూ.19 లక్షల 90 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని పీజెఆర్ ఎంక్లేవ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జనవరి 4వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు.దీంతో ఆ ఉద్యోగి నగదు ను ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తు వచ్చాడు. పెట్టిన నగదుతో పాటు, కమిషన్ చూపిస్తూండడంతో బాధితుడు పలు దఫాలుగా రూ.19 లక్షల 90 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు రెట్టింపైన నగదు యాప్‌లో చూపించే రూ.80 లక్షలు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొరియర్ వచ్చిందంటూ..

అమీన్‌పూర్ పరిధిలోని నరేంద్రనగర్ కాలనీకి చెందిన ఓ అర్చకుడికి జనవరి 13వ తేదీన కొరియర్ వచ్చిందంటూ ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన అపరిచిత వ్యక్తి కొరియర్‌లో అడ్రస్ తప్పుగా ఉందని, పది రూపాయలు పంపితే దాన్ని సరిచేసి మీకు కొరియర్ అందజేస్తామని చెప్పి అర్చకుడికి లింకు పంపించాడు. దీంతో అర్చకుడు ఆ లింకును క్లిక్ చేసి పది రూపాయలు పంపించే క్రమంలో అతని ఖాతాలో ఉన్న రూ.99 వేల నగదు కట్ అయ్యాయి.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గతంలో డివిజన్‌కు రూ.8 కోట్లు మంజూరయ్యేవని, నేడు కేవలం రూ.4 కోట్లు మాత్రమే మంజూరు అవుతున్నాయని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, కార్పొరేటర్లు, ఇతర అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి పరిధిలో పెండింగ్‌లో ఉన్న, మంజూరై ప్రారంభం కాని పనులన్నీ సకాలంలో పూర్తి చేసేలా చూడాలని జోనల్ కమిషనర్‌ను ఆయన కోరారు. చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ల వారీగా నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై జెడ్సీతో చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, కార్పొరేటర్లు హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డి, ఉప్పలపాటిశ్రీకాంత్, మంజులా రఘునాథ్‌రెడ్డి, రాజకుమార్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌వేర్ స్టోర్ ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న సంస్థ కంట్రీ మేనేజర్ రాథేశ్వర్‌దేవర్

గచ్చిబౌలి: ఫుట్‌వేర్ రంగంలో పేరుగాంచిన న్యూబ్యాలెన్స్ స్టోర్‌ను నగరంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. దేశంలోనే తొలి రిటైల్ స్టోర్‌ను కొండాపూర్‌లోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో సంస్థ కంట్రీ మేనేజర్ రాథేశ్వర్‌దావర్ బుధవారం ప్రారంభించారు.

సుందరకాండ పారాయణం

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారద శంకరమఠంలో అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గామీణ కళాజ్యోతి అవార్డు గ్రహీత వి.వేణుగోపాల్‌చే సుందరకాండ పారాయణంను ఈ నెల 9 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సిఎస్ఆర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పారాయణం ఉంటుందని భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పిల్లర్ల దశలోనే రెండేళ్లు.. మార్కెట్‌కు ఇంకెన్నాళ్లు?

- అర్ధంతరంగా నిలిచిన యార్డు నిర్మాణ పనులు
- దృష్టి సారించని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో వ్యాపార సముదాయాలు మొత్తం ఒకేచోట ఉండేలా రెండేళ్ల క్రితం మార్కెట్ యార్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కానీ.. అంతలోనే పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా మార్కెట్‌లో అందుబాటులో లేకపోవటంతో మున్సిపాలిటీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వ్యాపారస్తులు ఎక్కడపడితే అక్కడ షాపులను ఏర్పాటు చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 22వార్డులు ఉండగా సుమారు 60వేల వరకు జనాభా ఉంటుంది. రెండేళ్ల క్రితం పటాన్‌చెరుకు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.25కోట్ల నిధులను కేటాయించగా మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇక రూ.6కోట్లతో సమీకృత మార్కెట్ యార్డును నిర్మించేందుకు నిధులు కేటాయించడంతో అప్పటి ప్రజాప్రతినిధులు అట్టహాసంగా పనులు ప్రారంభించారు. తదనంతరం గత ప్రభుత్వం నిధులను మంజూరు చేయకపోవడంతో యార్డు పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి.



పిల్లర్ల దశలో మార్కెట్ యార్డు నిర్మాణం

ట్రాఫిక్‌కు అంతరాయం..

పనులు నిలిచిపోయి రెండేళ్లవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో పనులను నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. అధిక జనాభా ఉన్న మున్సిపల్ పరిధిలో మార్కెట్ యార్డు నిర్మిస్తే కూరగాయలు, మాంసం, తదితర వస్తువులు ఒకేచోట లభిస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులపై చిరు వ్యాపారస్తులు షాపులను ఏర్పాటు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రభుత్వం స్పందించి మార్కెట్ యార్డు నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులతో చర్చించాం



గత ప్రభుత్వం కేటాయించిన నిధులను మంజూరు చేయకపోవడంతోనే సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. ఈ విషయమై ఇటీవల ఉన్నతాధికారులతో చర్చించాం. త్వరలోనే మార్కెట్ యార్డు పనులు ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తాం.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బొల్లారం

‘సండే ఈవినింగ్ టాక్’

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవినింగ్ టాక్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ‘ఎడాప్టింగ్ టు చేంజ్’ అనే అంశంపై వెంచర్ క్యాపిటలిస్ట్ బికె రిషిధర్ ఉపన్యాసం ఇస్తారు.

అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా విజయభాస్కర్



రాయదుర్గం: ఐఐఎం–వైజాగ్‌లో డాక్టర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన విజయభాస్కర్ మారిశెట్టి నియమితులయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న విజయభాస్కర్ విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లో డాక్టర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అంబేడ్కర్ చైర్‌లో ముఖ్యంగా దేశంలో సామాజికంగా వెనుకబడిన సమాజాలను ఉద్ధరించే లక్ష్యంతో పరిశోధన, శిక్షణా కార్యక్రమాలు, ఫీల్డ్ వర్క్, బోధనా కార్యకలాపాలను నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. కాగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

డ్రగ్ ఫ్రీ హైదరాబాద్‌కు సహకరించాలి

- మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్



గచ్చిబౌలి: స్టార్ హోటళ్ళలో డ్రగ్స్‌కు అనుమతి ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ స్పష్టం చేశారు. మాదాపూర్ జోన్ పరిధిలోని స్టార్ హోటళ్ళ నిర్వాహకులు, యజమానులతో ఆయన బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డ్రగ్ ఫ్రీ తెలంగాణ, డ్రగ్ ఫ్రీ హైదరాబాద్‌కు ప్రతి ఒక్కరూ విధిగా సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి డ్రగ్స్‌కు అనుమతిస్తే ఎండీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టార్ హోటళ్ళలో మైనర్లకు మద్యం విక్రయించరాదని, ఇవ్వరాదని సూచించారు. ప్రైవేటు పార్టీలకు అనుమతించే సమయంలో డ్రగ్స్ లేకుండా పార్టీలు జరిగే చూడాలని, అయినప్పటికీ డ్రగ్స్ వినియోగించినట్లు సమాచారం వస్తే వినియోగించిన, సరఫరా చేసిన హోటల్‌పై కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరించారు. సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ నర్సింహ్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం.. ఆక్రమణల తొలగింపు



శాతవాహననగర్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటి శాతవాహననగర్ కాలనీలో బుధవారం జీహెచ్‌యంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి సుస్మిత, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నగేష్‌లు తమ సిబ్బందితో కలిసి రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. శాతవాహననగర్ కాలనీలో రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇష్టానుసారంగా రోడ్లపై వ్యాపారం నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎస్ఐ చంద్రకాంత్, జీహెచ్‌యంసి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: యల్లమ్మబండ, ఎన్‌టిఆర్‌నగర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా దేవాలయం రెండవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం లక్ష్మీ గణపతి సహిత గురు మూల మంత్ర హోమం, 108 కలశాలతో స్వామివారికి రుద్రాభిషేకం, పుష్పార్చన, మహా మంగళహారతి, ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

- జోనల్ కమిషనర్ స్నేహశబరీష్‌ను కలిసిన జగదీశ్వర్‌గౌడ్



గచ్చిబౌలి: నియోజకవర్గం పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని జోనల్ కమిషనర్ స్నేహశబరీష్‌ను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ కోరారు. బుధవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా ఇటీవల రంగారెడ్డిజిల్లా ఇన్‌చార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి నిధులు మంజూరు చేయాలని కోరగా ప్రణాళికను అధికారులు రూపొందిస్తే అవసరమైన నిధులను మంజూరు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారని ఆమెకు వివరించారు.

యానిమల్ కేర్ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: యల్లమ్మబండలోని యానిమల్ కేర్ సెంటర్‌ను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి సందర్శించారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రక్రియ, యానిమల్ కేర్ సెంటర్‌ను పరిశీలించారు. సెంటర్‌ను శుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు. ఇటీవల వీధి కుక్కల వల్ల జరిగిన దురదృష్టకర సంఘటనలను దృష్టిలో పెట్టుకొని సిబ్బంది మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కాశీనాద్‌యాదవ్, శివరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

నల్లవల్లిలో ‘పల్లెకు పోదాం’

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, తదితర విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.